క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మాచవరం: అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ అన్నారు. మండలంలోని రేగులగడ్డలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి, పథకాలు అందని వారిని గుర్తించి మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంగళరావు, గ్రామ సర్పంచ్ జక్కుల కొండలు, మాజీ సర్పంచులు అలవాల వెంకటేశ్వర్లు, తిక్కా నాగేశ్వరావు, అలవాల కొండలు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా సీమోను



దాచేపల్లి : దాచేపల్లి జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ మండల శాఖ అధ్యక్షుడిగా పందిటి సీమోనును ఎన్నుకున్నారు. స్థానిక దక్షణ గడ్డలోని లూథరన్ దేవాలయం ఫెలోషిప్ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. నియోజకవర్గ అధ్యక్షులు చందాల మరియదాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా కోట దేవసహాయం, ఉపాధ్యక్షుడిగా ఆలేటి రామారావు, ప్రధాన కార్యదర్శిగా దొప్పలపూడి మహేష్, కోశాధికారిగా షేక్ జాన్, సహాయ కార్యదర్శిగా నవీన్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు ఆదూరి మాణిక్యరావు, మోషే తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి



పిడుగురాళ్ల: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీలక్ష్మీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద సోమవారం జరిగింది. ఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపిన వివరాల మేరకు మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన సుకమంచి నవీన్‌కుమార్ (24) కోటనెమలిపురిలోని సంక్రాంతి పండుగకు బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో పట్టణంలోని శ్రీలక్ష్మీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్ ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

రూ.31వేలు, సెల్‌ఫోన్లు స్వాధీనం



దుర్గి: మండలంలోని ఆత్మకూరు గ్రామ పరిధిలోని బుగ్గవాగు సమీపంలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎస్ కోటయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తన సిబ్బందితో అసాంఘిక చర్యలకు అనువుగా ఉన్న ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. దానిలో భాగంగా బుగ్గవాగు సమీపంలో పేకాట నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.31వేలు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట, నాటుసారా తయారీ, అక్రమ మద్యం కలిగి ఉండటం, బెట్టింగ్‌లకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

రెంటచింతల: మండలంలోని మంచికల్లు గ్రామంలో జూదం(పేకాట) ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామ శివార్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,200 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా జూదం ఆడుతున్నా, నాటుసారా కాచినా, విక్రయించినా తెలంగాణ మద్యం సరఫరా చేసినా, విక్రయించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీసులకు సహకరించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వైభవంగా సంక్రాంతి వేడుకలు

- గ్రామ గ్రామాన అంబరాన్నంటిన సంబరాలు
- పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు, ఆటల పోటీల నిర్వహణ



అమ్మవారి సన్నిధిలో సంక్రాంతి వేడుకలలో ఈవో నరసింహబాబు తదితరులు

దుర్గి: మండల కేంద్రమైన దుర్గి, అన్ని గ్రామాలలో ప్రజలు, రైతులు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుర్గిలో వేంచేసియున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారి రథోత్సవంతో పాటు మహిళల కోలాటాలు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీ మ్యూజికల్ ఈవెంట్లో యువకులు పాల్గొన్నారు. ఎస్ఐ కోటయ్య ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. పలు గ్రామాలలో పితృదేవతలకు పూజలు నిర్వహించి కొత్త బట్టలు ధరించి సంప్రదాయాలను కొనసాగించారు. అడిగొప్పల నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి సన్నిధిలో సంక్రాంతి వేడుకలను ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహబాబు ఆధ్వర్యంలో ఆలయ సన్నిధిలో బియ్యపు గాదె, బొమ్మల కొలువు ఏర్పాటు చేసి గంగిరెద్దును పూజించి దేవస్థానం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. హరిదాసు సంకీర్తనలతో అమ్మవారి పల్లకి సేవ నిర్వహించారు. కంచరగుంట గ్రామానికి చెందిన కెరియర్ ఐటి ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్, డెరెక్టర్లు అరిగెల కొండలరావు, జి వెంకట గురువులు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు భీమా అప్పారావు, లక్ష్మయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరకొండ పున్నారావు, మాదాసు బిక్షమయ్య, మాదాసు హనుమంతరావు, మాదాసు వెంకయ్య పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కొత్త అల్లుళ్లు, బంధు మిత్రులతో ప్రతి ఇంట సంతోషాలు వెల్లివిరిశాయి. భక్తులు వేకువజాము నుంచే రెంటచింతలలోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిట్టగుడిపాడు గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. రెంటాల గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు శేష భట్టాచార్యులు నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి, భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. తుమ్మకోట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రధాన అర్చకులు మల్లికార్జున శర్మ, స్వయంపాకుల సత్యనారాయణమూర్తి, ఎస్.సతీష్ శర్మ, నేతృత్వంలో రామలింగేశ్వర స్వామి, జనార్ధనస్వామి, సీతారామ స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

దాచేపల్లిలో సంక్రాంతి వేడుకలు

దాచేపల్లి : సంక్రాంతి పండుగ వేడుకలు మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. పండుగ నేపథ్యంలో ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పండుగ శోభను తలపించేలా లోగిళ్ల ముందు రంగవల్లులు వేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పొందుగల గ్రామంలో సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులను సర్పంచ్ ఇమామ్‌వలి అందజేశారు. మండలంలోని శ్రీనగర్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లోని విజేతలకు టెక్నోపెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కూసం నాగిరెడ్డి, ఎంపీటీసీ ఆకూరి కాశీరెడ్డి తదితరులు బహుమతులు అందించారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం



బహుమతిని అందజేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, తదితరులు

రెంటచింతల: ముగ్గుల పోటీలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని.. మన సంస్కృతిలోని మూలాలను, సంప్రదాయాలను కాపాడుకుందామని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని స్థానిక ఉట్లస్తంబాల సెంటర్లో రామకృష్ణ సేవామండలి, గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఎంపీపీ చౌడేశ్వరి దాతలు, నిర్వాహకులతో కలిసి బహుమతులను అందచేసి మాట్లాడారు. తరాలు మారిన మన మూలాలు మరవకూడదన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదవ బహుమతులను వి.గురవమ్మ, వి.ధనలక్ష్మి, పి.అన్నపూర్ణ, టి.ఎస్.లక్ష్మి, ఎస్.అరుణ గెలుపొందారు. ఈ పోటీలలో పాల్గొన్న 60 మందికి కామన్ గిఫ్టులు అందజేశారు. కార్యక్రమంలో మల్లిఖార్జున స్వామి దేవస్థానం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, నిర్వాహకులు గుంటక కాశిరెడ్డి, పల్పూరి రాముడు, పల్పూరి శివ, నాళం పెద బాబు, గుండా సత్యవతి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిడుగురాళ్లలో సంక్రాంతి వేడుకలు

పిడుగురాళ్ల: సంక్రాంతి పండుగను పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఇళ్ల ముందు వేసిన రంగుల ముగ్గులు, సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా చెరుకు గడలు, పాల పుంతలు వంటి ముగ్గులతో బజారులన్నీ ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలాడాయి. మొత్తం మీద సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు ప్రజలు ఘనంగా నిర్వహించారు.

మాచవరంలో సంక్రాంతి వేడుకలు

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి గడప ముందు మహిళలు వేసిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రైతులు తమ వ్యవసాయానికి తోడుగా ఉన్న ఎద్దులు, కోడె దూడలు, పాడి ఆవులు, గేదెలకు పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. పలు దేవాలయాల్లో స్వామి వార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల పురవీధుల్లో ఊరేగించారు. బంధుమిత్రుల రాకతో గ్రామాలు కళకళలాడాయి.

కోనంకిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

పిడుగురాళ్లరూరల్: సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించటం చాలా గర్వకారణంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ అథారిటీ ఇన్‌చార్జి చైర్మన్ ఈదా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమెన్ అండ్ స్పూన్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ అథారిటీ ఇన్‌చార్జి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి హాజరై కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సంవత్సరాల్లో ఆచారాల గురించి చెప్పుకోవటమే జరుగుతుందని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీయటం చాలా గర్వకారణంగా ఉందన్నారు. సనాతన ధర్మాలను ఎప్పుడు పాటించాలని ఆయన అన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో, ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ముత్తారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ గాదె తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి, సర్పంచ్ కొండలరావు, డాక్టర్ కృష్ణకాంత్, జూలకంటి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



సత్రశాల దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన మల్లికార్జునస్వామి

ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు

మాచర్ల రూరల్: మన పండుగలు దేశ సంస్కృతిలో ఒక భాగమని, అలాంటి పండుగల విశిష్టతను మరువకుండా మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించటం ఆనందకరమని మండల పార్టీ సీనియర్ నాయకులు బూడిద శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్ళపల్లిలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులిచ్చి మాట్లాడా రు. ప్రతి సంవత్సరం తాళ్ళపల్లి పీఆర్కే, పీవీఆర్, బూ డిద యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేస్తున్న గ్రామ పెద్దలకు అభినందనలు తెలిపారు. ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు యాదవ్, సర్పంచ్ నోముల కృష్ణ, యూత్ నాయకులు యల్లాల బ్రహ్మయ్య యాదవ్, మాజీ సర్పంచ్‌లు పుట్టా బ్రహ్మయ్య, శ్రీనునాయక్, మహంకాళి శ్రీను, గాలి కొండలు, సంపత్ శేఖర్, కొండా గోపి, మల్లిఖార్జున పాల్గొన్నారు.

గురజాలలో సంక్రాంతి

గురజాల: వీధుల్లో అందమైన రంగవల్లులు.. ప్రతిఇంటా పిండి వంటల ఘుమఘుమలు.. గొబ్బెమ్మలకు పూజలు.. ఆటపాటల పోటీలు.. గోమాతకు ప్రత్యేక పూజలతో ప్రతి ఇంటా సంక్రాంతి పండుగ వైభవం ఉట్టిపడింది. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలు ప్రజలు ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగకు ఏడాదికోకసారి ఎక్కడెక్కడ నుంచో వచ్చేవారంతా ఒకే చోట చేరి పల్లెల్లో వెలుగులు నింపారు. ప్రతి లోగిలి సంక్రాంతి ముగ్గులతో కళకళలాడాయి. గ్రామాల్లో హరిదాసులు, గంగిరెద్దుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.



రెంటచింతలలోని అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి



పొందుగలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



మాచవరంలో రంగులు, గొబ్బెమ్మతో అందంగా అలంకరించిన ముగ్గు



బహుమతులు అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ అథారిటీ ఇన్‌చార్జి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి



ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

శాంతి మార్గమే దైవ మార్గం



ఎంఎం ఉజమ్మిల్‌ను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు



పల్నాడు జిల్లా స్థాయి ఇస్తమాకు హాజరైన ముస్లిం సోదరులు

పీఎం ఉజమ్మిల్

మాచవరం: శాంతి మార్గమే దైవ మార్గమని బెంగళూరుకు చెందిన హజరత్ మౌలానా పీఎం ఉజమ్మిల్ సాహెబ్ తెలిపారు. మండల కేంద్రమైన మాచవరంలోని జీకే పబ్లిక్ స్కూల్‌లో ముస్లిం సోదరుల సహాయ, సహకారాలతో సోమవారం పల్నాడు జిల్లా స్థాయిలో ఇస్తమా కార్యక్రమం నిర్వహించారు. జల్సా ఇత్తేహాదేమిల్లత్, ఇస్తెఖ్ బాలె రమాజన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరత్ మౌలానా పీఎం ఉజమ్మిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరు కలిసిమెలిసి ఉండాలని, దైవప్రవక్త మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని తెలిపారు. ఒకరి పట్ల మరొకరు స్నేహభావంతో ఉండి సమాజంలో దైవభక్తితో ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతావరణంలో, అల్లా సన్నిధిలో గడపాలని సూచించారు. అనంతరం ఇస్లామిక్ మోడల్ స్కూల్‌లో ఖురాన్ చదివిన విద్యార్థులకు బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేల మందికి పైగా ముస్లిం సోదరులు హాజరయ్యారు. హాజరైన ప్రతి ఒక్కరికి భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం మౌలానా ఉజమ్మిల్‌ను స్థానిక ఎస్ఐ సమీర్ బాషాతోపాటు ముస్లిం మత పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో ముఫ్తీ అబ్దుల్ బాసిత్ సాహెబ్, మౌలానా అబ్బాస్ ఖాన్ సాహెబ్, మహ్మద్ షర్‌ఫుద్దీన్ హుదవి సాహెబ్, ముజాహిదుల్ ఇస్లాం సాహెబ్, అజ్మతుల్లా ఖాన్ సాహెబ్, ఆఫీస్ సాహెబ్, సిలార్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

భౌభౌలతో బెంబేలు



వీధుల్లో హల్ చల్ చేస్తున్న కుక్కలు



కుక్క కరచి గాయాలైన దృశ్యం

కుక్కకాటుకు గురవుతున్న పిల్లలు, పెద్దలు

పిడుగురాళ్ల: కుక్కల బెడద రోజురోజుకు పిడుగురాళ్ల పట్టణంలో ఎక్కువైంది. రోజు పట్టణంలో కుక్కకాటుకు గురైన వారు సైతం పెరిగిపోతున్నారు. పట్టణంలో ప్రధానంగా 26వ వార్డులో కుక్కలు ఎక్కువగా ఉండి రోడ్డుపైకి వచ్చి వెళ్లే వారిపై అరుస్తూ గాయపరుస్తున్నాయి. ఈ ప్రాంతంలో మూడు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు, చిన్న పిల్లలు సైతం కుక్కల బారిన పడి గాయపడుతున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులో వైఎస్సార్ బొమ్మ వద్ద పిల్లలతో స్కూటీపై వెళ్తున్న తులసీరామ్ కుటుంబ సభ్యులపై ఓ కుక్క దాడి చేసి గాయపరిచింది. అలాగే మరో ఇద్దరు చిన్నారులతోపాటు, భార్యభర్తలు వెళ్తుండగా కుక్కలు గాయపరిచాయి. ఇలా రోజు డులువురిపై కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. కానీ పట్టించుకునే వారు లేక కుక్కల బెడదతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కుక్కల నుంచి కాపాడండి బాబోయ్ అని ప్రజలు అల్లాడుతుంటే అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. తులసీరాంకు కాలిపై గాయాలు కాగా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి టీకా వేయించుకున్నాడు. రోజు కనీసం ఐదు నుంచి పది కేసులు ప్రభుత్వ వైద్యశాలకు కుక్కకాటు టీకాల కోసం వస్తున్నాయని వైద్య సిబ్బంది తెలుపుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లను వివరణ కోరగా పట్టణంలోని అన్ని ప్రాంతాలలో కుక్కల బెడద ఉందని తమ దృష్టికి వచ్చిందని, అయితే ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కుక్కలను పట్టుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేయటం జరిగిందని, త్వరలోనే కుక్కలను పట్టుకొని ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తా

- పొగలు రావటంతో భయాందోళనకు గురైన స్థానికులు
- తప్పిన పెను ప్రమాదం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో రోడ్డు ఎక్కుతుండగా గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న ఆటో బోల్తా పడిన ఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్యాస్ సిలిండర్ల లోడుతో వస్తున్న ఆటో ప్రధాన రహదారి నుంచి రైల్వే స్టేషన్ వెళ్తుండగా మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనాలు అడ్డంగా ఉండటంతో వాటిని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఆటో బోల్తా పడటంతో ఒక్కసారిగా ఆటోలో నుంచి పొగలు రావటంతో స్థానికులు పరుగులు తీశారు. ఆటో డ్రైవర్ ఆటోలో ఇరుక్కుపోవటంతో కొంత సమయానికి పొగలు తగ్గటంతో స్థానికులు ధైర్యం చేసి ఆటోను పైకి లేపి ఆటో డ్రైవర్‌ను బయటకు తీశారు. ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలు అయ్యాయి. సిలిండర్లు అన్నీ రహదారిపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు ధైర్యం చేసి సిలిండర్లను తిరిగి ఆటోలో లోడు చేసి పంపించటంతో ఆ ప్రాంతంలోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గ్యాస్ సిలెండర్లు లీక్ కాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది.

అయ్యప్ప తిరు ఆభరణాల ఊరేగింపు



ఆభరణాలతో ఊరేగింపుగా వస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

పిడుగురాళ్లరూరల్: అయ్యప్ప నగర్‌లోని అయ్యప్ప దేవస్థానం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో వేంచేసియున్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి తిరు ఆభరణాల ఊరేగింపు, పడిపూజ మహోత్సవ కార్యక్రమం సంక్రాంతిని పురస్కరించుకొని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వీకే సతీష్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామునే స్వామివారికి సుప్రభాత సేవ, మహా గణపతి హోమం, నవ విధ అభిషేకాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు తిరు ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరు ఆభరణాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం భక్తులకు మకర జ్యోతి దర్శనం ఇచ్చారు. అనంతరం పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుండా శ్రీనివాసరావు, అధ్యక్షులు అంచూరి శ్రీనివాస్‌రెడ్డి, సీతారామాంజనేయులు, మణికంఠ, కపిలవాయి గోపాలరావు, వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్యసేవలు

పిడుగురాళ్లరూరల్: చలికాలంలో చిన్నారులను జాగ్రత్తగా చూడాలని చిన్న పిల్లల వైద్య నిపుణులు గుర్రం కృష్ణకాంత్ అన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను పరిశీలించి జ్వరం, జలుబు, దగ్గు, ఆయాసం, రక్తహీనత, శ్వాస ఇబ్బందులు, బరువు తక్కువ వంటివి పరిశీలించి మందులను అందజేశారు. జూలకంటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండాస్తంభాన్ని విరగ్గొట్టిన దుండగులు

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న వైఎస్సార్‌సీపీ జెండా స్తంభాన్ని గుర్తు తెలియని దుండగులు సోమవారం విరగొట్టారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీకి బలంగా పట్టు ఉండటాన్ని జీర్ణించుకోలేని తెలుగుదేశం పార్టీ శ్రేణులే ఈ దురాగతానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఓసీ ఏరియాలో ఉండే జెండాను గతంలోను విరగ్గొట్టారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మరలా ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శిరిగిరి గోపాలరావులు పరిశీలించి ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కాటయ్య, సైదా, జానీబాషాలు ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఏసు మార్గం అనుసరణీయం



గుహను ప్రారంభించి మాట్లాడుతున్న బిషప్ భాగ్యయ్య

మాచర్ల రూరల్: వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన లూర్ధుమాత దేవాలయంలో లక్షలాది రూపాయలతో లూర్ధుమాత గుహను నిర్మించటం శుభపరిణామమని గుంటూరు బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రాయవరం గ్రామంలో మాజీ ఎంపీపీ సోమకూర రాజారెడ్డి ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించిన గుహను బిషప్ ప్రారంభించి మాట్లాడారు. 200 సంవత్సరాల క్రితం నిర్మించబడిన లూర్ధుమాత దేవాలయం ఎంతో విశిష్టమైందన్నారు. ఇలాంటి చర్చి ప్రాంగణంలో గుహను నిర్మించటం ఆనందకరమన్నారు. ఏసు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి తోటివారికి సాయమందించినప్పుడే మనం నిజమైన భక్తుల మన్నారు. విచారణ గురువులు రత్నబాబు, ఏపూరి రాయపరెడ్డి, కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి, మర్రెడ్డి, అనిల్‌కుమార్, ఎలీషా, గుడిపెద్దలు బొమ్ము నాగరాజు, రాజారావు, భాస్కర్, జోజయ్య, సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, జోజి తదితరులున్నారు.